andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.8 । కనిష్ఠం 20.6



8

నిర్మల్
జిల్లా వార్తలు

శుక్రవారం 15 నవంబరు 2024

పత్తి కొనుగోళ్లకు ఆధార్ లింక్



- జిల్లాలో అప్పటికప్పుడే రైతులకు అందని డబ్బులు
- దీనిని ఆసరాగా చేసుకుంటున్న ప్రైవేటు వ్యాపారులు
- తమ వద్ద అమ్మగానే డబ్బుల అందజేత
- ధర తక్కువ చెల్లిస్తున్నా ప్రైవేటు వైపే మొగ్గు
- నగదు కావాలంటే రెండు శాతం కట్

నిర్మల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పత్తి కొనుగోలు వ్యవహారం ప్రహసనంగా మారుతోందని అంటున్నారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు జరుగుతుండగా ఆ కొనుగోలుకు దీటైన రీతిలో ప్రైవేటు వ్యాపారులు తమ దందాను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు వ్యవహారానికి ఆధార్‌ను లింక్ చేయడంతో డబ్బులు ఎప్పటికప్పుడు చెల్లించకపోవడంతో వారంతా నగదు కోసం ప్రైవేటు వ్యాపారులవైపే మొగ్గు చూపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న ప్రైవేటు వ్యాపారులు రైతుల అవసరాన్ని లక్ష్యంగా చేసుకొని మొదట చెక్కులిస్తామంటూ నమ్మిస్తున్నారు. రైతులు నగదు కావాలంటూ పట్టుబడితే వారికి రెండు శాతం డబ్బులు కట్ చేసుకొని చెల్లిస్తున్నారంటున్నారు. సీసీఐ వ్యాపారులు డబ్బులు ఆలస్యంగా చెల్లించడమే కాకుండా తేమశాతంలో కఠినంగా వ్యవహరిస్తున్న కారణంగా రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతుందని అంటున్నారు. సీసీఐ క్వింటాల్‌కు రూ.7521లను చెల్లిస్తుండగా ప్రైవేటు వ్యాపారులు మాత్రం రూ.7050 నుంచి 7100 డబ్బులను మాత్రమే చెల్లిస్తున్నప్పటికీ రైతులు మాత్రం ప్రైవేటు వ్యాపారుల వైపే పత్తి పంటను అమ్ముకునేందుకు మొగ్గు చూపుతుండడం కొనుగోలు వ్యవహారంలో జరుగుతున్న లోపాలకు అద్దం పడుతోందని అంటున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సీసీఐ ద్వారా 600 మంది రైతుల వద్ద 13,679 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. దీని విలువ రూ.7.78కోట్ల విలువ కాగా ఇందులో నుంచి 455 మంది రైతులకు రూ.5.33 కోట్లను చెల్లించారు. ఈ డబ్బులను అధికారులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. అయితే సీసీఐ ద్వారా డబ్బుల చెల్లింపులో జాప్యం జరుగుతున్న కారణంతో పాటు తేమ శాతం విషయంలో కఠిన వైఖరితో రైతులు తమ పత్తి పంటను ప్రైవేటు వ్యాపారులకే అమ్ముకుంటున్నప్పటికీ సీసీఐ మాత్రం తమ వైఖరిని మార్చుకోకపోవడం చర్చకు తావిస్తోందంటున్నారు.

చెల్లింపుల్లో అయోమయం


రైతులకు సీసీఐ డబ్బుల చెల్లింపు విషయంలో అయోమయ పరిస్థితులను సృష్టిస్తుందని అంటున్నారు. ముఖ్యంగా పత్తిపంటను అమ్ముకునే రైతుల ఆ.దార్ కార్డును లింకేజీ చేస్తున్న కారణంగా చెల్లింపుల్లో తీవ్రమైన జాప్యం ఏర్పడుతోందని చెబుతున్నారు. అయితే సీసీఐ ద్వారా చెల్లింపులు ఆలస్యమవుతున్న కారణంగా రైతులు తక్షణ డబ్బుల కోసం ప్రైవేటు వ్యాపారాలను ఆశ్రయిస్తున్నారంటున్నారు. ప్రైవేటు వ్యాపారులు మొదట పంటను కొనుగోలు చేయగానే దానికి సంబంధించి డబ్బులను చెక్కుల రూపంలో చెల్లిస్తున్నారు. అయితే అత్యవసరంగా డబ్బులు అడగగానే వారికి రెండు శాతం కోత విధించి మిగతా డబ్బులను అప్పటికప్పుడు చెల్లిస్తున్నారంటున్నారు. తక్షణ చెల్లింపుల పేరిట వ్యాపారులు రైతుల నుంచి బలవంతంగా రెండు శాతం కట్ చేస్తున్నప్పటికీ వారిని అడిగే వారే కరువయ్యారంటున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు రైతులను రెండు శాతం పేరిట బురిడి కొట్టిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తేమ నిబంధనలతో ఇక్కట్లు

సీసీఐ అధికారులు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న పత్తికి రకరకాల నిబంధనలు విధిస్తుండడంతో రైతులు ప్రైవేటు వైపే మొగ్గు చూపాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అంటున్నారు. రైతులు పత్తి పంటను ఆరబెట్టిన తరువాతనే కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నప్పటికీ సీసీఐ అధికారులు మాత్రం యంత్రాంగంతో తేమను తనిఖీ చేసి శాతాన్ని నిర్ధారిస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటున్నారు. ప్రైవేటు వ్యాపారులు మాత్రం ధర తక్కువ చెల్లిస్తూనే తేమను పెద్దగా పరిగణలోకి తీసుకోకపోతుండడంతో రైతులు తమ పత్తి పంటను అమ్ముకునేందుకు అటువైపే మొగ్గు చూపుతున్నారని చెబుతున్నారు.

1.47లక్షల ఎకరాల్లో పత్తి సాగు

కాగా జిల్లాలో ఈ సారి 1.47లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఈసారి దిగుబడి లక్ష్యాన్ని 10లక్షల క్వింటాళ్ళుగా నిర్ధారించారు. జిల్లాలో మొత్తతం నాలుగు కొనుగోలు కేంద్రాల పరిధిలో 17 జిన్నింగ్ ఫ్యాక్టరీలను నోటిఫైడ్ చేశారు. ఇప్పటి వరకు సీసీఐ ద్వారా 13,679 క్వింటాళ్ళ పత్తిని సీసీఐ కొనుగోలు చేయగా దీనికి నాలుగింతలకు పైగా ఇప్పటికే ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారంటున్నారు. దీని కోసం గానూ రూ.7.78 కోట్ల విలువ కాగా రూ. 5.33 కోట్లను రైతులకు చెల్లించారు. కాగా గత సంవత్సరం సీసీఐ ద్వారా 4.43లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా ప్రైవేటు వ్యాపారులు 2.69లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేశారు. ఈ సారి క్వింటాల్‌కు 7521 కాగా గత సంవత్సరం 7020 రూపాయలుగా ఉంది.





కొనుగోలు కేంద్రంలో పత్తిని పరిశీలిస్తున్న బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి (ఫైల్)

ఎడ్‌బిడ్ శివాలయంలో క్షీరాబ్ది ద్వాదశి పూజలు

ముథోల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో గల శివాలయంలో కార్తీక మాసంలో బుధవారం రాత్రి క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా తులసి దామోదర కళ్యాణం, ఆకాశ దీపం, జ్వాలతోరణం, దీపదానం, దీపోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి బసవ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.



జ్వాలతోరణోత్సవం

రాజూర అడవుల్లో పెద్దపులి సంచారం

- పులిగుండం ప్రాంతంలో పశువుల మందపై దాడి
- రెండు దూడలకు గాయాలు

ఖానాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గత నెల రోజులుగా జిల్లాలో బెంబేలెత్తిస్తున్న పెద్దపులి ఖానాపూర్ మండలం రాజూర అడవుల్లో ప్రవేశించింది. మూడు రోజుల క్రితం మామడ అటవీ రేంజ్ కార్యాలయం పరిధిలోని బూరుగుపల్లిలో ఓ ఎద్దును దాడి చేసి చంపిన పెద్దపులి తాజాగా ఖానాపూర్ మండలంలోని రాజూర అడవుల్లో పశువుల మందపై దాడి చేసినట్లు పశువుల కాపరులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళ్తే పశువుల కాపర్లు తెలిపిన కథనం ప్రకారం... ఉదయం బావాపూర్(ఆర్), దాసు నాయక్ తండా గ్రామాలకు చెందిన అర్జున్, గుగ్లావత్ రమేష్, శంకర్, జైసింగ్ అనే నలుగురు పశువుల కాపరులు రోజులాగే గురువారం ఉదయం పశువులను మేపేందుకు అడవుల్లోకి వెళ్లారు. మధ్యాహ్నం 12:30 గంటల తర్వాత భీమన్న గుట్ట వెనకాల గల పెద్దవాగు నుండి పులిగుండం వెళ్లే దారిలో పెద్దపులి ఒక్కసారిగా పశువుల మందపై దాడి చేసింది. దీంతో గేదెలు, ఆవులన్నీ భయంతో పరుగులు తీశాయి. వెనుకబడిన రెండు దూడలను పెద్దపులి వేటాడే ప్రయత్నం చేయగా వాటి అరుపులతో ఒక్కసారిగా గేదెలన్నీ పులిపై ఎదురు దాడి చేసేందుకు ప్రయత్నించాయి. దీంతో పెద్దపులి ఆ దూడల్ని వదిలేసి అడవుల్లోకి వెళ్లినట్లు పశువుల కాపర్లు చెబుతున్నారు. మధ్యాహ్నం 12:30 గంటల నుండి 3:20 వరకు పెద్దపులి పశువుల మందల్ని వెంబడిస్తూ వచ్చినట్లు వారు పేర్కొన్నారు. పెద్దపులి దాడి చేయడంతో నలుగురు పశువుల కాపర్లు అడవిలో పెద్ద ఎత్తున కేకలు వేస్తూ పశువులను ఊర్లోకి తరుముకు వచ్చినట్లు వారు పేర్కొన్నారు. పెద్దపులి దాడిలో రెండు దూడలు గాయపడ్డాయి. ఈ విషయమై దిమ్మదుర్తి ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పులి దాడి చేసినట్లు చెబుతున్న ప్రాంతం దిమ్మదుర్తి అటవీ రేంజ్ కార్యాలయం పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. కాగా పశువుల మందపై దాడి చేసింది పెద్ద పులా లేక చిరుతపులా అనే విషయం శుక్రవారం స్పష్టత వస్తుందన్నారు. పశువుల కాపరులు ఊర్లోకి వచ్చి విషయం తమకు తెలిపే సరికి చీకటి పడిందని శుక్రవారం తెల్లవారగానే పులిదాడి చేసినట్లుగా చెబుతున్న ప్రాంతంలో పులి పాదముద్రలను పరిశీలించి పెద్దపులి దాడి చేసిందా లేక చిరుతపులి అనే విషయాన్ని నిర్ధారిస్తామన్నారు. పెద్దపులి సంచరిస్తున్నందున పశువులను అడవుల్లోకి తీసుకెళ్లవద్దని మరోసారి ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. పెద్దపులి దాడిలో గాయపడినట్లు భావిస్తున్న దూడలను గురువారం రాత్రి దిమ్మదుర్తి ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్ సహా అటవీ శాఖ అధికారులు పరిశీలించారు. పులి దాడి చేసిన ప్రాంతం తాలూకు వివరాలను పశువుల కాపరుల నుండి అడిగి తెలుసుకున్నారు.



పెద్దపులి దాడిలో గాయపడిన దూడ

గ్యాస్ భద్రత.. పొదుపుపై అవగాహన

భైంసా, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) ; పట్టణంలోని వశిష్ఠ జూనియర్ కళాశాలలో గురువారం కృపా గ్యాస్ సప్లయర్స్ ఆధ్వర్యంలో గ్యాస్ భద్రత, పొదుపుపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ అజయ్ పాఠక్ విద్యార్థులకు గ్యాస్ పొదుపు, భద్రతలపై సూచనలు చేశారు.

సంక్షిప్త సమాచారం

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



కుంటాల, నవంబర్, 14: (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూర్యాపూర్ గ్రామానికి చెందిన నెరెల్ల లక్ష్మణ్ (38) అనే రైతు గురువారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుంటాల ఎస్సై భాస్కరాచారి తెలిపారు. లక్ష్మణ్‌కు వాగు గడ్డన రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే గత మూడు సంవత్సరాల నుంచి అధిక వర్షాల కారణంగా వ్యవసాయ పంటలు కొట్టుకుపోయి పెట్టిన పెట్టుబడులు సైతం నిండని పరిస్థితి నెలకొంది. దీంతో గత రెండు సంవత్సరాల నుంచి అప్పులు పెరిగాయనే మనస్థాపంతో గురువారం ఉదయం 3 గంటల సమయంలో ఇంటి నుండి చేనుకు వెళ్లిన ఆయన పురుగుల మందు సేవించి 5 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. కుటుంబీకులకు పురుగుల మందు సేవించినట్లు తెలపడంతో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రారంభమైన సహకార వారోత్సవాలు

కుంటాల, నవంబర్, 14 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో గురువారం సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. చైర్మన్ సట్ల గజ్జారాం, సీఈవో నాగభూషణ్, సిబ్బంది జెండాను ఎగురవేశారు.

నేటి నుంచి వేములవాడకు ప్రత్యేక బస్సులు : డీఎం

నిర్మల్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా పవిత్ర పుణ్యక్షేత్రం వేములవాడకు నిర్మల్ నుంచి ప్రత్యేకబస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ డీఎం ప్రతిమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 శుక్రవారం నుంచి 18 వరకు ఉదయం 7 గంటలకు బయలుదేరి 10:15కు చేరుకొని మధ్యాహ్నం 1 గంటలకు అక్కడి నుంచి నిర్మల్ బయలుదేరుతుందన్నారు. ఈ అవకాశం భక్తులు ఉపయోగించుకోవాలని కోరారు.

22న ఇసుక బహిరంగ వేలం

ఖానాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఖానాపూర్‌లో నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి నిర్వహించిన తనిఖీల్లో అధికారులు సీజ్ చేసిన ఇసుకను ఈ నెల 22వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సీజ్ చేసిన 38 ట్రాక్టర్ల (114 క్యూబిక్ మీటర్ల) ఇసుకను 22వ తేదీన వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ బహిరంగవేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు రూ. 5,000లను డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలన్నారు. వేలంపాటలో అత్యధిక ధరకు ఇసుకను దక్కించుకున్న బిల్డర్లకు ఇసుకను కేటాయించి మిగతా పోటీదారులకు వారు డిపాజిట్ చేసిన డబ్బులను తిరిగి రెండు రోజుల్లో అప్పగిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు ముందస్తుగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని అదే రోజు డిపాజిట్ డబ్బులతో తహసీల్దార్ కార్యాలయానికి హాజరు కావాలన్నారు. కాగా ఈ నెల 7వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'పొద్దంతా పోగేసి రాత్రుల్లో తరలింపు' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై కదిలిన అధికార యంత్రాంగం ఈ ఇసుకను సీజ్ చేసిన విషయం విదితమే.

విద్యార్థుల ఆత్మహత్యలు బాధాకరం

- కలెక్టర్ అభిలాష అభినవ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్ వేదికపై వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బాసర, నవంబర్, 14 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆత్మహత్యలు చాలా బాధాకరమని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులకు ఆదేశించారు. గురువారం ట్రిపుల్‌ఐటీ బాసర కళాశాల సమావేశ మందిరంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్‌తో కలిసి ఆమె 17 కమిటీల విద్యార్థులతో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం ఎంతో బాధాకరమని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధనతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులంతా సానుకూల దృక్పథంతో ఉండాలని, సమస్యలు ఏమైనా ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో కష్టపడి చదివి 10/10 సాధించి ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు పొందారని, ప్రతిభ చూపి కళాశాలకు గుర్తింపు తీసుకరావాలని కోరారు. గతంలో ఇక్కడ చదివిన విద్యార్థులంతా ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. బాసర ట్రిపుల్ ఐటీకి మంచి గుర్తింపును నిలబెట్టాలని కోరారు. అనంతరం స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్‌లో గల ఆడిటోరియంలో పీయూసీ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. మనిషి జీవితంలో హెచ్చు తగ్గులు ఉంటాయని, ధైర్యంగా అధిగమించాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. నూతన ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు అంకురార్పణ చేసే విధంగా మన ఆలోచన విధానం ఉండాలని పేర్కొన్నారు. జిల్లా వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులకు ప్రొఫైల్ యాప్ రూపొందించాలని కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు సూచించారు. ప్రతిభతో రాణించేందుకు తగిన ప్రణాళికలను రచించుకోవాలని పేర్కొన్నారు. మన ఆలోచన విధానమే మనకు మార్పుకు నాంది పలుకుతుందని తెలియజేశారు. మన చుట్టూ ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఒకరికొకరుగా సహాయ సహకారాలు అందిస్తూ ముందుకెళ్లాలని విద్యార్థులను కలెక్టర్ కోరారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ గత నెల నుంచి తీసుకున్న చర్యలను ప్రస్తావించారు. విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు పరిపాలన అధికారులు ప్రభుత్వ సహకారాలతో విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్‌సాగి, అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, వివిధ విభాగాల అధికారులు, క్యాంపస్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ డా.రాజేష్, తహసీల్దార్ పవన్‌చంద్ర, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

- భైంసా- నిర్మల్ జాతీయ రహదారిపై ధర్నా
- 50 రోజుల నుంచి సాగని కొనుగోళ్లు
- అబ్దుల్లాపూర్ రైతుల ఆందోళన



భైంసా - నిర్మల్ జాతీయ రహదారి రాస్తారోకో చేస్తున్న రైతులు



రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోయి వాహనాలు

కుంటాల, నవంబర్, 14 : (ఆంధ్రజ్యోతి) ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ కుంటాల మండలం అర్లి (ఎక్స్) రోడ్డు వద్ద భైంసా - నిర్మల్ రహదారిపై ధర్నా రైతులు నిర్వహించారు. గురువారం లోకేశ్వరం మండలం అబ్దుల్‌పూర్ గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో గత 50 రోజుల క్రితం పోసిన కుప్పలు ఇప్పటి వరకు కొనుగోళ్లు చేపట్టకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకపక్క రైతు భరోసా రాకపోవడం, రుణమాఫీ పూర్తిగా కాకపోవడం ఇబ్బందుల పాలవుతున్న రైతులకు ధాన్యం కొనుగోళ్లు సైతం సక్రమంగా కొనసాగగపోవడంతో తమను ఎవరు ఆదుకునేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు గ్రామానికి చెందిన 250 మందికి పైగా రైతులు రహదారిపై గంటన్నరపాటు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డు కిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. గత 50 రోజుల నుంచి ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడంతో ప్రతీరోజు ధాన్యం కుప్పల వద్దనే పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. జిల్లా స్థాయి అధికారులు వచ్చి తమకు ఖచ్చితమైన హామీ ఇచ్చేంత వరకు కదలబో మని రోడ్డుపై బైటాయించారు. కొద్దిరోజుల క్రితం కొన్ని లారీలు ధాన్యాన్ని తూకం వేసినా నిర్వాహకులు గోదాంకు తరలించగా ధాన్యంలో తరుగును నిర్వాహకులే భరించాలని గోదాం సిబ్బంది తెలిపినట్లు దీంతో అప్పటి నుంచి కొనుగోళ్లు నిలిపే సినట్లు రైతులు తెలిపారు. తాజాగా రెండు రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి అధికారులు ఓ రైస్‌మిల్లును కేటాయించారు. సదరు రైస్‌మిల్ యజమాని బస్తా 43 కేజీల చొప్పున తూకం చేసి పంపితేనే తాను ధాన్యం బస్తాలు దించుకుం టానని చెప్పాడని దీంతో రైతులు చేసేదేమి లేక గురువారం ఈ రాస్తారోకో చేయవలసి వచ్చిందని గ్రామానికి చెందిన రైతులు పేర్కొన్నారు. తాము బస్తాకు 42 కేజీల వరకు తూకం వేసి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని 43 కేజీలంటే చాలా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి తెలుసుకున్న లోకేశ్వరం తహసీల్దార్ మోతీరాం అక్కడికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయినా రైతులు కదలకపోవడంతో భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని రైతులను సముదాయించి హామీ ఇచ్చి ధర్నా విరమింపజేశారు.

ట్రస్మా రాష్ట్ర కమిటీలో జిల్లా సభ్యులకు చోటు

నిర్మల్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ట్రస్మా కమిటీలో నిర్మల్ జిల్లాలోని పలువురు సభ్యులకు చోటు లభించినట్లు అధ్యక్షుడు చంద్రగౌడ్ తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఇటీవల ట్రస్మా వ్యవస్థాపక అధ్యక్షుడు కే.పాపిరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటైందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వేల్పూర్ సాయన్న యాదవ్ (నిర్మల్), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏ.రాజేందర్ (ముథోల్), జాయింట్ సెక్రటరీగా ఆకుల రమేష్ (సారంగాపూర్) ఎన్నికయ్యారని తెలిపారు. జాతీయ ఉపాధ్యక్షుడు అనంత్‌రెడ్డి విశిష్టఅతిథిగా హాజరైనట్లు తెలిపారు.

లగచర్ల ఘటన పట్ల జేఏసీ నిరసన



నిర్మల్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : లగచర్లలో ఇటీవల కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడిని ఖండిస్తూ టీఈజేఏసీ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ... దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలన్నారు. గౌరవ అధ్యక్షుడు ఎంసీ లింగన్న, నాయకులు రమేష్, గజేందర్, జే. లక్ష్మణ్, రవికుమార్, కే. శ్రీనివాస్, ప్రవంతి, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

రాజూరలో అగ్నిప్రమాదం.. 25 క్వింటాళ్ల పత్తి దగ్ధం

- సుమారు 5 లక్షలకు పైగా ఆస్తి నష్టం



రాజూర గ్రామంలో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఇళ్లు

ఖానాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజూర గ్రామంలో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే స్థానికులు తెలిపిన కథనం ప్రకారం... రాజూర గ్రామానికి చెందిన దావత్ పోశెట్టి అనే రైతు తన వ్యవసాయ క్షేత్రంలో పండిన 25 క్వింటాళ్ల పత్తిని ఇంట్లో నిల్వ చేశారు. కాగా వ్యక్తిగత పనుల నిమిత్తం భార్యాభర్తలిద్దరూ వేరే ఊరికి వెళ్లారు. బుధవారం రాత్రి ఇంట్లో షార్ట్ సర్క్యూట్ అయ్యి 25 క్వింటాళ్ల పత్తి, ఇంట్లో ఉన్న ఇతర సామాగ్రి అంతా దగ్ధమైంది. సుమారు 5 లక్షల పైగా ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు చెబుతున్నారు. పండించిన పంటతో పాటు ఇంట్లో ఉన్న సామాగ్రి కూడా పూర్తిగా అగ్రికి ఆహుతి కావడంతో తమ కుటుంబం రోడ్డున పడాల్సి వచ్చిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



నిర్మల్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమన్ అలీ కోరారు. గురువారం జిల్లా గ్రంథాలయంలో 57 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రంథాలయంలో పాఠకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తానన్నారు. అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంచుతానని తెలిపారు. నిర్మల్ గ్రంథాలయాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యదర్శి బుగ్గారెడ్డి, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

వసూల్ రాజాలు!

(ఐదో పేజీ తరువాయి)

అలవాటు పడి నిబంధనల పేరిట కొర్రీలు పెడుతున్నారు. నేరుగా వెళ్తే పని మాట దేవుడెరుగు కాని రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాహనదారులు వాపోతున్నారు. లైసెన్స్‌లు, వాహన రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ తదితర కార్యకలాపాల కోసం ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నా ఏజెంట్ వ్యవస్థ ఎందుకు కనిపిస్తుందో అధికారులకే తెలియాలి మరి. ఏజెంట్ల ద్వారా వెళ్తేనే ఎలాంటి పనైనా వెంటనే పూర్తయ్యే అవకాశం కనిపిస్తుంది. వాహనదారుల అవసరాన్ని బట్టి కమీషన్‌ను నిర్ణయిస్తూ దండుకుంటున్నట్లు తెలుస్తోంది. అసలు డ్రైవింగ్ రాకపోయినా డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించకున్న లైసెన్స్‌లను జారీ చేయడం రవాణా శాఖలో పరిపాటిగానే మారింది. రూ.5వేల నుంచి రూ.8వేలు ఇస్తే చాలు డ్రైవింగ్ లైసెన్స్‌లను ఇచ్చేందుకు ప్రైవేట్ దళారులు వాహనదారులతో బేరం కుదుర్చుకుంటున్నారు. మొదట కొంత సొమ్మును ఇచ్చి అవసరమైన పత్రాలను అందిస్తే చాలు లైసెన్స్ రెడీ అయిపోతుంది. ఆ తర్వాత పూర్తిగా చెల్లిస్తే అధికారులను ఒప్పించి మరీ లైసెన్స్ జారీ చేయిస్తున్నారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు, సమయం వృథా కాక పోవడంతో వాహనదారులు కూడా ప్రైవేట్ ఏజెంట్ల ద్వారానే రవాణా శాఖలో పనులను పూర్తి చేయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రైవేట్ సిబ్బందిదే పెత్తనం..

అక్రమ సంపాదనకు ఎగబడుతున్న అధికారులు తెలివిగా కమీషన్ కలెక్షన్‌కు ప్రత్యేకంగా ప్రైవేట్ సిబ్బందిని నియమించుకుంటున్నారు. తమ చేతికి మట్టి అంటకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏజెంట్ల ద్వారా వచ్చిన ఫైళ్లను లెక్కలు వేసకుని మరి సాయంత్రం వేళల్లో ప్రైవేట్ సిబ్బంది ద్వారా వసూలు దందాకు ఎగబడుతున్నారు. ప్రతి ప్రైవేట్ ఏజెంట్‌కు రహస్యంగా కోడ్ సంఖ్యను కేటాయించి దాని ద్వారా కమీషన్‌ను నిర్ణయిస్తూ వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఏదైనా వాట్సాప్ చాటింగ్ ద్వారానే సమాచారాన్ని చేరవేస్తున్న ఏజెంట్లు తమ పనిని పూర్తి చేసుకుంటున్నారు. అలాగే అధికారుల వాహన డ్రైవర్లు కూడా ఈ వ్యవహారంలో తలదూర్చుతూ సెటిల్‌మెంట్ చేస్తున్నట్లు సమాచారం. కమిషన్ వసూలుకు పాల్పడుతున్న ప్రైవేట్ సిబ్బందికి అధికారులే పరోక్ష సహకారాన్ని అందిస్తూ అండగా నిలుస్తున్నారు. ప్రైవేట్ సిబ్బందికి నెలవారీగా కొంత వేతనంగా చెల్లిస్తూ తమ కార్యాకలాపాలను కొనసాగిస్తున్నారు. ఇదంతా ఉన్నతాధికారులకు తెలిసినా తెలియనట్లుగానే వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అటెండర్ స్థాయి నుంచి అధికారి వరకు తలోకొంత కమీషన్లు పంచుకోవడంతో ఈ వ్యవహారమంతా సాఫీగా, గుట్టుచప్పుడుకాకుండా సాగిపోతున్నట్లు తెలుస్తోంది.

ఆటో బోల్తా.. మహిళ మృతి..



గుంతలో పడిన ఆటో

ఆదిలాబాద్‌రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆటో అదుపుతప్పి నీటి గుంతలో పడి ఓ మహిళ మృతిచెందగా ముగ్గురికి గాయాలైన ఘటన ఆదిలాబాద్‌రూరల్ మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారిగూడ డంపింగ్ యార్డ్ సమీపంలో ఆటో ముందరి టైర్ పంచర్ కావడంతో రోడ్డు పక్కనే ఉన్న నీటి గుంతలో పడిపోయింది. ఈ ఘటనలో వ్యవసాయ కూలీ మోరే సవిత(35)తోపాటు మరో ముగ్గురు సైతం నీటి గుంతలో పడ్డారు. ముగ్గురు క్షేమంగా బయటపడ్డప్పటికీ సవిత మాత్రం గల్లంతయింది. కొద్ది సేపటికి ఈతగాళ్ల సహకారంతో మృతదేహాన్ని వెలికి తీశారు. క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించారు. కాగా రూరల్ ఎస్సై ముజాహిద్ ఘటన స్థలాన్ని చేరుకొని కేసు దర్యాప్తు చేపట్టారు.

హైమాస్ లైట్లు ప్రారంభించిన మాజీ సర్పంచ్

బోథ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహకారంతో సోనాల గ్రామంలో గురువారం సాయంత్రం హైమాస్ లైట్స్ మాజీ సర్పంచ్ సదానందం ప్రారంభించారు. హైమాస్‌లైట్‌ల ఏర్పాటు వల్ల రాత్రిపూట ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే వారు ఇబ్బందులు లేకుండా వెళ్లే ఆస్కారం ఉందన్నారు. ఆయన వెంట రాజన్న పల్లె మాజీ వార్డు సభ్యులు శంకర్, సంతోష్, జీవన్, ముండేశ్వర, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

నాగోబా ఆలయాన్ని సందర్శించిన గురుకులం విద్యార్థులు

బోథ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పర్యాటక ప్రాంతాల దర్శనం కోసం ప్రారంభించిన తెలంగాణ దర్శన కార్యక్రమంలో భాగంగా గురువారం బోథ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో గిరిజనుల ఆరాధ్య దైవం అయిన నాగోబా ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నాగోబా ఆలయ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఏడాది పుష్యమాసం అమావాస్య రోజున ప్రారంభమయ్యే జాతర ప్రపంచంలోనే గుర్తింపు పొందిందని వివరించారు. జాతర ప్రత్యేకతను ఉపాధ్యాయులు వివరించారు.

కిన్వాట్ నియోజకవర్గంలో జిల్లా ఎంపీ ప్రచారం

బోథ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బోథ్ నియోజకవర్గం పక్కన ఉన్న కిన్వాట్ నియోజకవర్గంలో ఎంపీ జి.నగేష్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అక్కడ ఎమ్మెల్యే వారిలో ఉన్న కె రామ్ గెలుపు కోసం తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో గురువారం ప్రచారాన్ని చేపట్టారు. కెరామ్ వెంట ఉండి ఆయన హయాంలో జరిగిన అభివృద్ధి పథకాలను వివరిస్తూ బీజేపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ఆయన వెంట బోథ్ మండల పార్టీ కన్వీనర్ బోరే రవీందర్‌తో పాటు మాజీ జడ్పీటీసీ తాటిపల్లి రాజు, సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్, అల్క. గణేష్, పెందుర్తి తులసీరామ్ తదితరులు ప్రచారం చేపట్టారు.

రోడ్డును పరిశీలించిన అధికారులు

తలమడుగు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గత కొన్ని సంవత్సరాల నుంచి అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఎంపీడీవో చంద్రశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రవీణ్ గ్రామస్తులు కలిసి రోడ్డును పరిశీలించారు. గత ఆరు సంవత్సరాలుగా రోడ్డు పనులు చేపట్టకపోవడంతో రోడ్డునుంచి వచ్చే దుమ్ముతో అనారోగ్యం పాలవుతున్నామని గ్రామస్తులు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులు రోడ్డును పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతామని హామీనిచ్చారు. అదే విధంగా రోడ్డు నిర్మాణంలో గ్రామస్తులు అన్ని విధాల సహాయ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆసం రవి, రవికాంత్ యాదవ్, నేతుల గంగన్న తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో చెప్పుల దుకాణం దగ్ధం

ఇంద్రవెల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న చెప్పుల షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి షాపులోని సామగ్రి దగ్ధమైంది. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకోగా రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం కలిగినట్లు యజమాని మోతేవార్ సంబాజీ తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై దుబ్బాక సునీల్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఫైర్ సిబ్బంది అగ్ని మాపక వాహనంతో చేరుకొని మంటలు ఆర్పేశారు. రూ. ఐదు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు షాపు నిర్వాహకుడు తెలిపారు.

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లాలోని లగచర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్, అధికాంలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆదిలాబాద్ ఉద్యోగ జేఏసీ చైర్మన్ సంద అశోక్ సంఘం డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగుల ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. విధి నిర్వహణలో ఉన్న ఉన్నతాధికారులపై రైతుల పేరిట కొందరు దాడి చేయడం సిగ్గు చేటన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఉట్నూర్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరోగ్య కళాశాల అనే కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదేశాల రెండో గురువారం డ్రగ్స్ వల్ల వచ్చే పర్యవసానాల గురించినటువంటి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డ్రగ్స్ వల్ల వచ్చే నష్టాలను విద్యార్థులకు ప్రిన్సిపల్ ధనరాజ్ బోధిం చారు. కళాశాల సైన్స్ అధ్యాపకులు వినోద్, శివప్రసాద్ విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగేనష్టాలను చెపాక్లారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, సువర్ణ, శ్రీలత పాల్గొన్నారు.

తలమడుగు : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థుల సంక్షేమం కోసం విద్యార్థులకు శారీరక మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఆరోగ్య పాఠశాల అనే కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తలమడుగులో ప్రారంభించడం జరిగిందని మండల విద్యాధికారి వెంకట్‌రావు తెలిపారు. ఉదయం ప్రార్థన సమయంలో ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ హరీష్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రావు,పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి)పత్తి కొనుగోళ్ల విషయంలో రైతులకు న్యాయం చేసే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన ధర దక్కేలా చూడాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. గురువారం అఖిల పక్ష రైతు సంఘం నేతలతో కలిసిగిజిల్లా కలెక్టర్ రాజార్షిషాను ఆయన కలిశారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

● ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్



దంతనపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్

ఉట్నూర్, నవంబరు 14: స్వాతంత్ర సమరయోధులు, దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చూపిన మార్గంతో పాటు మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండలంలోని దంతనపల్లి జడ్పీఎస్ఎస్ పాఠశాలలో జాతీయబాలల దినోత్సవం, జవహర్‌లాల్ నెహ్రూజయంతి వేడుకలను ఘనంగా నిర్వహంచారు. కార్యక్రమానికి ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాం డెంట్ షబ్బీర్, డాక్టర్ సాడిగే రాజగోపాల్ పాల్గొన్నారు.

భీంపూర్: మండలంలోని గుంజల ప్రాథమిక పాఠశాలలో గురువారం మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, అట్ల అశోక్, మెస్రం హన్మాండు, నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గుంజలలో నెహ్రూ జయంతి వేడుకలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విద్యాలయ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇచ్చోడ సర్కిల్ సీఐ భీమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పోషకాహారం, నాణ్యమైన ఆహారం, చిరుతిండ్లకు వ్యత్యాసాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, డీఎస్పీ రాష్ట్ర నాయకులు అన్నేల లక్ష్మణ్, పాఠశాల కరస్పాండెంట్ మార శ్యాంరెడ్డి పాల్గొన్నారు.

బోథ్ : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను జరుపుకున్నారు. బోథ్‌లోని వేదం పాఠశాలలతో పాటు ప్రగతి, విజ్ఞాన్, ఉషోదయ, వివేకానంద, సరస్వతి, శిశు మందిర్ తదితర పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో గురువారం బాలల దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫుడ్ స్టాల్‌లను ప్రదర్శించారు.

నేరడిగొండ : బాలల దినోత్సవం సందర్భంగా నేరడిగొండ మండలంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలు కుంటాల, లకంపూర్‌లను జీసీడీఓ మేస్రంచాయ సందర్శించి పాఠశాలల్లో బాలల దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై విద్యార్థులను ప్రతి ఒక్కరు పాఠశాలలకు పంపాలని, చదువు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ పవార్ రవీందర్, వార్డెన్ స్వప్న పాల్గొన్నారు.

సిరికొండ: పలు ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం మాట్లాడుతూ...చిన్నారులు ఆనందంగా, ఆరోగ్యంగా అందరితో కలిసి మెలిసి ఉండాలన్నారు. ప్రవళిక, కళ్యాణి, పుష్పరాణి, గ్రామస్తులు ఇమ్రాన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మావల: నెహ్రూ సేవలను భారత జాతి ఎన్నడూ మరిచిపోలేదని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డు వద్ద గల చాచా నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తలమడుగు: నందిగామ దిశ ఆదివాసి పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులు ఆట, పాటలు ఆడుతూ ఘనంగా జరుపుకున్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీలగిరి దివాకర్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

ఆదిలాబాద్‌అర్బన్ : దేశ ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ అనేక సేవలు అందించారని తెలంగాణ కిసాన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు దర్మపురి చంద్రశేఖర్, అట్ల గోవర్ధన్‌రెడ్డి, కుదురుపాక సురేష్, రహీంఖాన్, నాగరాజు, గౌతం, శ్రీనివాస్, నలిమెల నవీన్‌రెడ్డి, బాలకృష్ణ, అడెల్లు తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న ఎస్సై

నార్నూర్ : మండలంలోని జమాడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలల దినోత్సవాన్ని గురువవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉట్నూర్ ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా హాజరై దేశ మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉట్నూర్ : మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవంను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆట పాటలతో, నృత్యాలు, వ్యాసరచన, చిత్రలేఖనం, డ్రామాలు, ఏక పాత్రాభినయాలు, మొదలయిన పోటీలు నిర్వహించారు.

ఆదిలాబాద్ రూరల్ : దేశ తొలి ప్రధాని చాచా నెహ్రూ చెప్పినట్టుగా నేటి బాలలే రేపటి పౌరులని, సమాజంలో వారు మంచి వారుగా ఎదిగినప్పుడే దేశం మరింత పురోగతి సాధిస్తుందని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. ఆదిలాబాద్ గజిటెడ్ నెంబర్.2 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.



బోథ్‌లో ఫుడ్‌స్టాల్‌ను పరిశీలిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

ఘనంగా సహకార ఉత్సవాలు

ఉట్నూర్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం ఆవరణలో సహకార జెండాను ముఖ్య కార్యనిర్వహణాధికారి మల్లయ్య జెండావిష్కరించి సహకార వారోత్సవాలను ప్రారంభించారు. అఖిల భారతీయ సహకార వారోత్సవాలు వారం రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు సుమిత్, అశోక్ పవన్, గణేష్, రైతులు దాసరి మోహన్, ఇబ్రహీం పాల్గొన్నారు.

తలమడుగు : సహకార సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు వారోత్సవాలు ఎంతగానో ఉపయోగపడుతాయని సీఈవో మోతే శ్రీనివాస్ అన్నారు. సహకార సంఘాల వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు సకాలంలో ఎరువులను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సాగర్, సత్యనారాయణబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : సమృద్ధిగా పంటలు పండి రైతు బాగున్నప్పుడే సహకార సంఘాలు బాగుంటాయని పీఏసీఎస్ చైర్మెన్ మేకల వెంకన్న యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ సత్యనారాయణ గౌడ్, డైరెక్టర్‌లు వీనిల్, సంతోష్, లింగన్న ఉత్తం పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: రైతు శ్రేయస్సు సహకార సంఘాల ప్రధాన ధ్యేయమని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయ ఆవరణలో 71వ సహకార వారోత్సవాలను పురస్కరించుకుని సహకార జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, సహకార డైరెక్టర్లు మధుకర్, నిద్యాస్‌సింగ్, సహకార సంఘం సీఈవో ధర్మసింగ్ ఉన్నారు.

బోథ్ : సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతాంగానికి పంట రుణాలతో పాటు అవసరమైన ఎరువులను అందించి రైతాంగానికి అండగా ఉంటుందని సహకార సంఘం కార్యాలయంలో సహకార వారోత్సవాలను పురస్కరించుకుని జెండాను ఎగురవేశారు. అఖిల భారత సహకార సంఘం వారోత్సవాలను పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. సహకార సంఘం పీఏసీఎస్ సెంటర్ ఇంచార్జి గోలి స్వామి పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో జెండా ఎగురేస్తున్న సీఈఓ

డిసెంబరు 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు

● అసెంబ్లీ ఇన్‌చార్జి కందిశ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పాలనకు యేడాది కాలం పూర్తి కానుండడంతో ప్రభుత్వం డిసెంబర్ 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిం చ తలపెట్టిందని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్ చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో ప్రజాపాలన సంవత్సర సంబ రాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి కాలనీ వాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కందిశ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికి ప్రజాపాలన శుభాకాంక్షలు తెలిపారు. మోదీ ప్రభుత్వం గ్యాస్ సిలీండర్ 1200 చేసి పేదల నడ్డి విరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ సిలీండర్ అందిస్తు ఆదుకుందన్నారు. ఇందులో సీనియర్ నాయకులు గిమ్మసంతోష్, లోకప్రవీణ్‌రెడ్డి, జహీర్‌రంజాని, అల్చెట్టినాగన్న, శంకరయ్య, జఫర్‌అహ్మద్, దాసరి ఆశన్న, నాగన్న, మహిళ నాయకురాలు శ్రీలేఖ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

అధికారులపై దాడిని సహించం

నేరడగొండ, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా అపోహలు వీడి సమగ్ర సర్వేకు వచ్చే అధికారులకు సహకరించాలని బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ విజ్ఞప్తి చేశారు. అధికారులకు వాస్తవ వివరాలతో కూడిన సమాచారాన్ని అందించి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులకు సహకరించాలని కోరారు. అలాగే సర్వేకు వచ్చే అధికారులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లుగా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

దుమ్ములేవకుండా ప్రత్యేక చర్యలు



దుమ్ము లేవకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్న సిబ్బంది

ఇచ్చోడ, నవంబరు, 14 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా నీళ్లతో క్యూరింగ్ చేయకుండా ప్రమాణాలు పాటించకుండా పనులు నిలిపివేసిన ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి అధ్వానం తీరుపై ఆంధ్రజ్యోతి ఎన్నాళ్లీ పనులు..? అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రహదారుల పనులను పునఃప్రారంభించారు. రహదారిపై వేసిన కంకరను తీసివేసి చదును చేస్తున్నారు. రహదారిపై దుమ్ము లేవకుండా ట్యాంకర్ల సహాయంగా నీళ్లతో క్యూరింగ్ చేశారు. రహ దారిపై ఉన్న కంకరను తొలగించి రోడ్డురొల్లరు సహాయంతో చదునుచేసి రహదారిని విస్తరించి పనులను ప్రారంభించారు. పనులు వేగవంతం చేసి త్వరలోనే రహదారిని ప్రజల రాకపోకలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామని అధి కారులు చెబుతున్నారు. ఇచ్చోడ ప్రజల చిరకాల వంచా అయిన రహదారి నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి ఇచ్చోడ అభివృద్ధికి సహకరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చదువుతో పాటు క్రీడారంగాల్లో రాణించాలి

● జోనల్‌స్థాయి క్రీడా పోటీల ముగింపు ఉత్సవాల్లో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ముథోల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు విద్యార్థులు క్రీడా రంగాల్లోనూ రాణించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం ముథోల్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న జోనల్ స్థాయి 10వ స్పోర్ట్స్ మీట్ 2024-25 క్రీడా పోటీల ముగింపు ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలన్నారు. నవంబరు 14 బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి విద్యార్థి క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి తనకు ఇష్టమైన ఆటలు ఆడాలని, క్రీడలు శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు ఎంతో ఉపయోగ పడతాయని తెలిపారు. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు కన్న కలలను సహకారం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠ శాలల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, అవసరమైన అన్ని వసతులను కల్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు కష్టపడి చదవాలని తల్లిదండ్రులకు, కళాశాలకు గుర్తింపు తీసుకురావాలని కోరారు. అనం తరం జోనల్ స్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహు మతులను కలెక్టర్ అందజేశారు. జట్టు ఛాంపియన్‌గా అండర్-19 మేడిపల్లి, అండర్-14 ఆర్మూర్, అండర్-17 మేడిపల్లి, ముథోల్ నిలిచాయి. ఈ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన వారు త్వరలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారు. అనంతరం కలెక్టర్, అధికారులను కళాశాల ఉద్యోగులు, సిబ్బంది శాలువాతో సత్కరించారు. అంతకుముందు దేశభక్తిగీతాలపై విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద రావు పటేల్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో శివకుమార్, ఎంఈవో రమణరెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నిరంజన్, డీసీవో ప్రశాం తి అధికారులు, పీడీలు, పీఈటీలు, ఉపాధాయయులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌జిల్లాలో ఘనంగా బాలల దినోత్సవం



పాఠాలు చెబుతున్న విద్యార్థి

నిర్మల్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పండిట్ జవహర్ లాల్ జయంతి సందర్భంగా జిల్లాలో బాలల దినోత్సవాన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ప్రతీరోజు ఉపాధ్యాయుల పాఠాలు విన్న విద్యార్థులు వారే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. ఉపాధ్యాయుల్లా వ్యవహరించారు. స్థానిక జుమ్మెరాత్‌పేట్ హైస్కూల్‌లో విద్యార్థులు బోధించిన పాఠాలు ఉపాధ్యాయులు పరిశీలించారు. ఉత్తమంగా బోధించిన వారికి బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రవిబాబు, ఉపాధ్యాయులు మనోహర్, మల్లేశం, దత్తురాం, రమణ, మంజుల, నాగలత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. నిర్మల్‌లోని ఆదర్శనగర్ వశిష్ఠ ఇంపెల్స్ టెక్నో స్కూల్‌లో గురువారం జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఆట పాటలతో నృత్యాలు చేసి అలరించారు. చైర్మన్ జి. శ్రీనివాస్ గౌడ్, ప్రిన్సిపాల్ మాధవి, అకాడమిక్ డైరెక్టర్ దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు. విజయ హైస్కూల్‌లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. జనరల్ సెక్రటరీ అయ్యన్నగారి భూమయ్య కరస్పాండెంట్ నాగభూషణం, వైస్ చైర్మన్ అంబారాణి, ఈసీ మెంబర్ విజయలక్ష్మి, ట్రెజరర్ ఆడెపు సుధాకర్ పాల్గొన్నారు.

ఖానాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కృష్ణవేణి హైస్కూల్‌లో విద్యార్థులకు మొబైల్ ప్లానిటేరియం నిర్వహించారు. ఇందులో భాగంగా నక్షత్రాలు, గ్రహాలు, సముద్రపు చేపలు, డైనోసార్లు, టైటానిక్ షిప్ తదితర అంశాలపై వివరంగా ప్రదర్శనలు నిర్వహించారు. మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు కార్యక్రమాలను నిర్వహించారు.

ముథోల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని శ్రీ అక్షర పాఠశాల, రవీంద్ర, భాష్యం, శ్రీ సరస్వతి శిశు మందిర్, మచ్కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సుభాష్, సాయినాథ్, సారథి రాజు, మాధవ్ రావు, మోహినుద్దీన్, తదితరులున్నారు.

నర్సాపూర్(జి), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా బాలల దినోత్సవాన్ని జరుపుకున్నారు.

కుంటాల, నవంబర్ 14 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు వాసవి హైస్కూల్‌లో బాలల దినోత్సవం నిర్వహించుకున్నారు.



తలమడుగు మండలం ఉమ్రి, గోగర్వడి అంతర్ రాష్ట్ర లింక్ రోడ్డు



ఎడ్ల బండ్లతో వ్యవసాయ పొలాలకు వెళుతున్న రైతులు

అంతర్రాష్ట్ర లింకు రోడ్డు హామీలకే పరిమితం!

• నిధులు మంజూరైనా ప్రారంభంకాని ఉమ్రి - గోగర్వడి రోడ్డు నిర్మాణం

తలమడుగు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తలమడుగు మండలంలో గల అంతర్రాష్ట్ర లింకు రోడ్డు హామీలకే పరిమితమైంది. రోడ్డు పనుల నిమిత్తం నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా పనులు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉమ్రి గ్రామం నుంచి మహారాష్ట్ర గోగర్వడి వరకు రోడ్డు నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలోనే రూ.4 కోట్ల నిధులు మంజూరు అయినప్పటికీ ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తలమడుగు మండలం ఉమ్రి గ్రామం మీదుగా మహారాష్ట్ర గోగర్వడి నుంచి కిన్వాట్ వరకు రోడ్డు నిర్మాణం చేపడితే తెలంగాణ, మహారాష్ట్ర వాసులకు రవాణా సౌకర్యం సులభంగా మారుతుంది. తెలంగాణ నుంచి మహారాష్ట్ర కిన్వాట్ వరకు వెళ్లాలంటే దాదాపు 50 కిలోమీటర్ల వరకు దూరం ఉంది. అయితే ఉమ్రి గ్రామం నుంచి రోడ్డు నిర్మాణం చేపడితే 20 కిలోమీటర్ల లోపు దగ్గరలో వస్తోంది. గతంలో రోడ్డు నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబు నాలుగు కోట్ల రూపాయలను మంజూరు చేసి ఆ రోడ్డుకు గిరిజన నాయకుడైన పేందూరు లక్ష్మణరావు పేరును సైతం నామకరణం చేసినప్పటికీ ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడం లేదు. దీంతో ఆదివాసీ గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కొండపైన, గిరిజన రైతులు వ్యవసాయ పొలాలు ఉండటంతో ఇటీవల రైతులందరూ కలిసి శ్రమదానంతో రోడ్డు మరమ్మతు పనులు చేసుకున్నారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తిఅయితే రైతులు పండించిన పంటలను మహారాష్ట్రకు తీసుకువెళ్లి విక్రయించుకునేందుకు అవకాశం లభిస్తుందన్నారు. అదేవిధంగా స్నేహ సంబంధంతోపాటు ఇతర సంబంధాలు మెరుగు పడుతాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

త్వరగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి

• పెందూర్ విశ్వనాథ్, గిరిజన నాయకుడు



రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరైనా అధికారులు ఇప్పటివరకు పనులు చేపట్టలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి. రోడ్డు నిర్మాణంతో కొండపైన ఉన్న రైతులకు మహారాష్ట్రలా ఎంతగానో ఉపయోగపడుతుంది. మహారాష్ట్ర నుంచి తెలంగాణ సరిహద్దు వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పెంబి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై సాయి కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనదారులు తమ వాహన ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. యువత చెడుమార్గంలో వెళ్లకూడదని వివరించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంచందర్, ఉపాధ్యాయులు నరసింహాచారి, సాయన్న, తదితరులు ఉన్నారు.



ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న లక్కడి జగన్మోహన్ రెడ్డి

సాయిబాబా ఆలయంలో

ఘనంగా దీపోత్సవం

• పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు

నిర్మల్అర్బన్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం సాయంత్రం కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయిదీక్ష సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని 11,116 దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం కార్తీక మాసంలో ఇక్కడి ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. అలాగే ఈసారి ప్రత్యేకంగా కోటి వత్తులతో భారీ దీపాన్ని తయారుచేసి వెలిగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి సభ్యులు పూదరి నరహరి, ఉప్పుల నందు, జైపాల్ రెడ్డి, లింగారెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీనివాస్, చౌదరి, పడిగెల శివ, రేఖ, జిందం గోవర్ధన్, తదితరులతో పాటు మహిళలు పాల్గొన్నారు.

భక్తి



దీపోత్సవంలో పాల్గొని దీపాలను వెలిగిస్తున్న మహిళలు



మంచిర్యాల పాఠశాలలో బాలికలతో మాట్లాడుతున్న పీఓ ఖుష్బుగుప్తా

పనిచేయని ఉపాధ్యాయులపై కొరడా

• ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో ఐటీడీఏ పీవో ఆకస్మిక తనిఖీలు • వాంకిడి హెచ్ఎం సస్పెన్షన్


ఉట్నూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలలో పనిచేయని ఉపాధ్యాయులు, సిబ్బంది పట్ల ఐటీడీఏ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. పనిచేయని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటూ కొరడా ఝులిపిస్తుండడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పీఓ ఖుష్బుగుప్తా ప్రతీరోజు ఉమ్మడి జిల్లాలోని ఏదో ఒకచోట పాఠశాలలో తనిఖీ చేసి పాఠశాలలో కొనసాగుతున్న చదువుల తీరు, విద్యార్థులకు అందిస్తున్న భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా వంటగదుల పరిశుభ్రంతో పాటు పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటున్నాయా లేదా పరిశీలిస్తూ ఎప్పటికప్పుడుచర్యలు తీసుకుంటున్నారు. అయినప్పటికి కొన్ని చోట్ల కొంతమంది ఉపాధ్యాయులు తమ విధులను నిర్లక్ష్యం చేస్తుండడంతో చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇటీవల కొమురం భీం జిల్లాలోని వాంకిడి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కారణంగా ప్రధానోపాధ్యాయుడిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా వాంకిడి బాలికల పాఠశాలను సందర్శించి ప్రధానోపాధ్యాయుడి నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు అనారోగ్యం పాలైనారని నియమించిన విచారణ కమిటీ నివేదిక ఆధారంగా శ్రీనివాస్ని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఇది ఇలా ఉండగా మంచిర్యాల ప్రధానోపాధ్యాయుడు మాధవ్ను సస్పెండ్ చేశారు. పాఠశాల బాలికలు వాంతులు చేసుకున్న సంఘటనపై విచారణాంతరం సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అదేవిధంగా ఇటీవల ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని తీవ్ర జ్వరంతో బాధపడుతు మృత చెందిన సంఘటనలో అక్కడ విధుల్లో ఉన్న ఏఎన్ఎంను తొలగించి వార్డెన్ను సంజాయిషి అడిగారు. ఇప్పటివరకు 100కు పైగా ఆశ్రమ పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రకృతి అధికారి ఇప్పటివరకు 40మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇదే కాకుండా ఇన్చార్జీ డీడీ జాదవ్వసంతరావు సైతం సమయం చిక్కినప్పుడల్లా ఆశ్రమ పాఠశాలలో తనిఖీ చేయగా మెనూ పాటిస్తున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులు సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా విధులు నిర్వహించాలని పరిశీలకులు కోరుతున్నారు.



వాంకిడి ఆశ్రమ పాఠశాల తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేస్తున్న పీఓ



ఆశ్రమ పాఠశాలలో వంటలు పరిశీలిస్తున్న పీఓ



• జిల్లా కేంద్రంలో ఉదయం కమ్ముకున్న పొగమంచు



చలితో వెచ్చని దుస్తులు ధరించి మార్నింగ్ వాక్ చేస్తున్న వాకర్స్



చలితో చలి మంటలు కాగుతున్న పట్టణ వాసులు

వణుకు పుట్టిస్తున్న చలి!

ఆదిలాబాద్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): గతవారం రోజులుగా ఆదిలాబాద్ జిల్లా లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడంతో చలి వణుకు పుట్టిస్తోంది. గురువారం జిల్లా గరిష్ఠ ఉష్ణోగ్రత 31.5 డిగ్రీలుగా నమోదుకాగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15.5 డిగ్రీలు గా నమోదైంది. మారుమూల గిరిజన గ్రామాలను దట్టమైన పొగమంచు కప్పేస్తోం ది. ఉదయం 9 గంటల వరకు బయటకు వెళ్లేందుకే ప్రజల భయపడుతున్నారు. సాయంత్రం 4 గంటల వరకే పనులను ముగించుకుని ఇండ్లలోకి వెళ్లి పోతున్నారు. ప్రతీయేటా జిల్లాలో నవంబర్, డిసెంబర్ మాసాలలోనే రికార్డు స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయి. రాబోయే రోజుల్లో మరింతగా చలితీవ్రత పెరిగే అవకాశం ఉందంటున్నారు. జిల్లాలోని బోథ్, భీంపూర్, తలమడుగు, బేల మండలాల్లోని పలు చోట్ల అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లాలో డిసెంబర్, జనవరి మాసాలను అతిశీతల మాసాలుగా పరిగణిస్తారు. ఈనెల చివరి వరకు ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.



PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nirmal Branch, Dist. Nirmal agreed to accord Loan to Ravi Guptha Chinthakunta S/o Shankar, Aged 40 Yrs, Occ: Business, R/o H.No.4-4-102, Somawarpet, Nirmal Town & District mortgage of the schedule referred property of Chintakunta Saroja (Co-Borrower/ Property holder). The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim or objection of whatsoever nature may put forth their claims before me within 7 days of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.

Hence this notice

SCHEDULE OF THE PROPERTY

That the RCC Roofed Shop bearing Mpl.No. 4-2-72, admeasuring 347.45 Sq.fts, equal to 38.60 Sq.Yds or say 32.72 Sq.Mtrs out of which RCC Roofed Ground Floor Plinth area 347.45 Sq.Fts, First Floor Plinth area 270.17 Sq.fts situated at Gandhi Chowk, Somawarpet, Badabazar, Nirmal Town and Mandal, Nirmal District, within the limits of Municipality, Nirmal under the jurisdiction of Registration District Adilabad and Registration Sub/District Nirmal

As Bounded by

East: House of Venkat Reddy H.No. 4-1-30, **West:** Road, **North:** House of Dharmaveer H.no. 4-2-71, **Southt :** House of Ch.Vishwanatham H.No. 4-2-73

Sd/- R. Jagadishwer Rao
B.Com, LLB, Advocate,
H.No. 6-2-67, Subhash Nagar,
Nizamabad, Ph: 9848094409


వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు


• ఆలయ ఆవరణలో ఘనంగా కుంకుమార్చన

ఖానాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మావతి నగర్లో గల శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా గురువారం ఆలయ ఆవరణలో మహిళలచే అమ్మవారికి ఘనంగా కుంకుమార్చన నిర్వహించారు. ఈ వేడుకలకు మండల నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. యజ్ఞచార్యులు చక్రపాణి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు లేకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఖానాపూర్లోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు





'తెలంగాణ దర్శిని' కార్యక్రమం ప్రారంభం

ఆదిలాబాద్‌రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణదర్శిని కార్యక్రమానికి ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శ్రీకారం చుట్టారు. గురువారం సైన్స్ డిగ్రీ కళాశాల యువటూరిజం క్లబ్ విద్యార్థులు తెలంగాణదర్శిని కార్యక్రమంలో భాగంగా ఇతర విద్యార్థులతో కలిసి పొచ్చెర జలపాతాన్ని సందర్శించారు. తెలంగాణదర్శిని కార్యక్రమం వల్ల విద్యార్థులకు తమ ప్రాంత భౌగోళిక, చారిత్రక స్థితిగతులు అవగాహన అవుతాయని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జగ్రామ్ అంతర్వేది పేర్కొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న ఇచ్చోడ సీఐ భీమేష్

నేరడిగొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హోటల్ యజమానులతో పాటు మటన్, చికెన్ వ్యాపారాలు చేసే వారు నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఇచ్చోడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భీమేష్ అన్నారు. గురువారం నేరడిగొండ పోలీసుస్టేషన్ ఆవరణలో హోటల్ యజమానులు, మటన్ చికెన్ సెంటర్ల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మటన్, చికెన్ అమ్మేవారు కుళ్లిన మాంస ఆహారాన్ని అమ్మరాదని, ఫిర్యాదు అందినట్లయితే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్‌తో పాటు హోటల్ యజమానులు, మటన్ చికెన్ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

నాందేడ్ రైల్వే డివిజన్ డీఆర్‌యూసీసీ సభ్యుడిగా రఘుపతి

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిలర్, బీజేపీ నాయకులు ఉష్కం రఘుపతి నాందేడ్ రైల్వే డివిజన్ (డివిజనల్ రైల్వేయూజర్స్ కన్సల్టేటీవ్ కమిటీ (డీఆర్‌యూసీసీ) సభ్యుడిగా నియమితులయ్యారు. ఎంపీ గోడం నగేష్ చేసిన సిఫార్సు మేరకు నాందేడ్ డివిజన్ డీఆర్‌యూసీసీ కార్యదర్శి జే.విజయ కృష్ణ ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఉష్కం రఘుపతికి పలువురు అభినందనలు తెలియజేశారు.

ఈనెల 18 వరకు

సోయా కొనుగోలు నిలిపివేత

బోథ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో సోయాబీన్ కొనుగోలు ఈనెల 18 వరకు నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి గోలిస్వామి తెలిపారు. సోమవారం రైతులు పంటను తీసుకువచ్చినట్లయితే కొనుగోలు జరుగుతాయని ఆయన తెలిపారు. రైతులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని పంటను తీసుకురావాలని ఆయన తెలిపారు.

వసూల్ రాజులు





పనుల కోసం కార్యాలయానికి వచ్చిన వాహనదారులు

- రవాణా శాఖలో అడ్డగోలుగా అక్రమ వసూళ్లు
- జిల్లా కార్యాలయంలో యథేచ్ఛగా దోపిడి దందా
- అడిగినంత ఇస్తే.. క్షణాల్లో పనిపూర్తి
- నేరుగా వెళ్తే నిబంధనల పేరిట కొర్రీలు
- కమీషన్, కలెక్షన్‌కు ప్రైవేట్ సిబ్బంది
- అవినీతి బాగోతంతో బిత్తరపోతున్న వాహనదారులు

ఆదిలాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణా శాఖలో వసూలు రాజుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. పైసలు ఇస్తేనే పని జరుగుతుందంటూ హుకుం జారీ చేయడంతో వాహనదారులు బిత్తరపోతున్నారు. కార్యాలయ ఆవరణలోనే ప్రైవేట్ ఏజెంట్ల ఆగడాలకు అడ్డు అదుపులేకుండా పోతోంది. కమిషన్ రూపంలో దండుకుంటూ తలోకొంత వాటాలు పంచుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇదంతా బహిరంగ రహస్యమే అయినప్పటికీ ఉన్నతాధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. వాహనదారుల అవసరం, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటు అడ్డగోలుగా దోపిడిదందాకు పాల్పడుతున్నారు. జిల్లాలో నిత్యం 50నుంచి 100 టు విల్లర్, ఫోర్ విల్లర్ లైసెన్స్‌లు, మరో 50 లోపు నూతన వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ జరుగుతున్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఈ లెక్కన నిత్యం లక్షకు పైగానే అక్రమ ఆదాయం సమకూరుతుందన్న టాక్ వినిపిస్తోంది. అవినీతికి అలవాటు పడిన కొందరు అధికారులు జిల్లాలో పోస్టింగ్‌ల కోసం భారీ పైరవీలు చేస్తూ ఇక్కడికి వస్తున్నారంటే ఏ మేరకు ఆదాయం ఉందో తెలుస్తూనే ఉంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

● శ్రీనివాస్, ఇన్‌చార్జి డీటీవో (ఆదిలాబాద్)

జిల్లా కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి మా దృష్టికి రాలేదు. ఏదైనా ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. వాహనదారులు ఇబ్బందులకు గురైతే ఫిర్యాదు చేయాలి. కార్యాలయంలోకి ప్రైవేట్ ఏజెంట్లను అనుమతించడం లేదు. గత నాలుగైదు రోజుల క్రితమే నేను ఇన్‌చార్జిగా బాధ్యతలను తీసుకున్నాను. కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలపై ప్రత్యేక దృష్టిని సారిస్తా. ఏదైనా నిబంధనల ప్రకారమే జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

కాసులకు కక్కుర్తి..


గత రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి టు విల్లర్, ఫోర్ విల్లర్ లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో అప్లై చేసుకుని జిల్లా రవాణా శాఖాధికారులను నేరుగా సంప్రదించారు. కానీ డ్రైవింగ్ రానిదే లైసెన్స్ ఇవ్వడం కుదరదంటూ ఆయన అప్లికేషన్‌ను రిజెక్ట్ చేశారు. దీంతో కార్యాలయం నుంచి బయటకు వచ్చి గంట తర్వాత ప్రైవేట్ ఏజెంట్ ద్వారా రూ.6వేలకు బేరం కుదుర్చుకుని తిరిగి వెళ్లడంతో అదే అధికారి మర్యాద పూర్వకంగా మాట్లాడి లైసెన్స్ ఇచ్చేందుకు ఒప్పుకోవడంతో సదరు వాహన యజమాని ఆశ్చర్యానికి గురి కావాల్సి వచ్చింది. ఇలా కాసులకు కక్కుర్తి పడుతున్న కొందరు అధికారులు అడ్డగోలుగా దోపిడి దందాకు తెరలేపుతున్నారు. ఇలా నిత్యం పదుల సంఖ్యలో లైసెన్స్‌లు నిబంధనలకు విరుద్ధంగానే అధికారులు జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది.

డ్రైవింగ్ రాక పోయిన డబ్బులిస్తే ఏదైనా సాధ్యమే నంటూ నిరూపించడంతో ప్రైవేట్ ఏజెంట్లు చెప్పిందే పై చేయిగా మారుతోంది. కార్యాలయ ఆవరణలోకి ప్రైవేట్ ఏజెంట్లకు అనుమతి లేదంటూ ఆదేశాలు జారీ చేసినా అవి ఎక్కడ అమలుకు నోచుకోవడం లేదు. నిత్యం కార్యాలయంలోనే మకాం వేస్తున్న ప్రైవేట్ ఏజెంట్లు వాహనదారులను నిలువు దోపిడి చేస్తున్న అధికారులకు అసలు పట్టింపే లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి.

అడ్డదారిలో దోపిడి..

రవాణా శాఖ కార్యాలయంలో అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వం అన్ని సేవలను ఆన్‌లైన్ ద్వారానే అందిస్తుంది. కానీ కొందరు అధికారులు అక్రమ సంపాదనకు

మిగతా 6వ పేజీలో...



సోనాల ఆసుపత్రి తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

బోథ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోనాల గ్రామంలో ఆసుపత్రిని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు గురించి డాక్టర్ నవీన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అయితే సోనాల ఆసుపత్రికి మారుమూల గిరిజన గ్రామాలు 50 నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, అయితే వ్యాక్సిన్ వేయడం ఇబ్బందికరంగా మారిందన్నారు. బోథ్ ఆసుపత్రి నుంచి తీసుకువెళితే బాగుంటుందని, అక్కడ ఉన్న వైద్య సిబ్బంది వైద్యాధికారి దృష్టికి తీసుకురావడం జరిగింది. అయితే మరోప్రాథమిక ఆరోగ్య కేంద్రం అవసరం ఉందని లేకుంటే మాములు గ్రామాలకు వైద్యం అందడం కష్టంగా ఉం టుందని అక్కడే ఉన్న మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ విషయాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు.

నిబంధనల మేరకు కొనుగోళ్లు జరగాలి : సబ్‌కలెక్టర్

ఇంద్రవెల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దని సబ్‌కలెక్టర్ యువరాజ్ మార్మాట్ అన్నారు. గురువారం మండలంలోని ఏమ్మైయికుంట గ్రామ సమీపంలోని రైతు ఉత్పాదక సంస్థ కాటన్ జిన్నింగ్ మిల్లులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ తనిఖీచేసి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రైతుల వద్ద పత్తి కొనుగోలు జరగాలని అన్నారు. జిన్నింగ్ మిల్లులో ప్రవేశం మొదలు తేమ శాతం పరీక్ష పరిశీలన, తూకం, విక్రయం ధర, రైతుల వేలిముద్రతో కూడిన ఆధార్ అను సంధానం, ఓటీపీ విధానాన్ని కంప్యూటర్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి రైతులకు ఎన్ని రోజుల్లో డబ్బులు ఖాతాల్లో జమ అవుతున్నాయని అడిగి సబ్‌కలెక్టర్ యువరాజ్ మార్మాట్ తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ ట్రైనీకలెక్టర్ అభిజ్ఞాన్ మాలివ్యా, సీసీఐ సీపీవో నరేష్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ ఈవో దేవన్న, రైతు ఉత్పాదక సంస్థ సీఈవో కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



జిన్నింగ్ మిల్లును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ తదితరులు

బాలల అభివృద్ధికి కృషి : పీవో ఖుష్బుగుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) ఏజెన్సీ ప్రాంతాల గిరిజన బాలల విద్యా అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా ప్రత్యేకకృషి చేస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన విద్యార్థుల అభివృద్ధి కోసం ఐటీడీఏ తీసుకున్న సానుకూలమైన చర్యలను గుర్తిస్తూ గర్విస్తున్నామన్నారు. టీఈఎల్‌సీ, లీప్ ఫర్ వర్డ్ వంటి సంస్థలతో భాగస్వామ్యం ద్వారా విద్యార్థుల కోసం మౌలిక నైపుణ్యాలను అభివృద్ధి చేసే కార్యక్రమాలు ప్రవేశ పెట్టబడ్డాయన్నారు. 6వ తరగతి 9వ తరగతి విద్యార్థుల కోసం టీఈఎల్‌సీతో కలిసి ప్రారంభించిన యంగ్ ఓరేటర్స్ క్లబ్ కథలు చెప్పడం, పిక్చర్ టాక్ వంటి కార్యక్రమాల ద్వారా ఇంగ్లీష్ కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుస్తుందన్నారు. ఇది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతు వారి కుటుంబాలకు గర్వకారణంగా మారిందన్నారు. 3వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థుల కోసం లీప్ వర్డ్‌తో కలిసి 133 ఆశ్రమ పాఠశాలలో ఆంగ్ల సాహిత్య కార్యక్రమం ప్రవేశ పెట్టామన్నారు. వాక్య నిర్మాణం, పఠనం, శబ్దం వంటి నైపుణ్యాలను బలోపేతం చేస్తూ భవిష్యత్ విద్యకు బలమైన భూమికను సృష్టిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రాయిసెంటర్ మేడి మేస్రం దుర్గు, హెచ్‌ఎం టీచర్లు పాల్గొన్నారు. ఆరోగ్య రంగంలో 60 మంది అమ్మాయిలు ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న రక్తహీనతను ఎదుర్కొనేందుకు ఐటీడీఏ ప్రారంభించిన గిరిజన్ పోషణ మిత్ర పథకం, మొరింగా చట్నీ, ఇప్పపువ్వు లడ్డు వంటి పోషకాహారంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. గిరిజన విద్యార్థులను రేపటి కోసం సన్నద్ధం చేస్తూ వారిని స్వావలంబనకు దారి తీసే విధంగా ఐటీడీఏ యొక్క కృషిని ప్రతిబింబిస్తాయన్నారు. ఈ సందర్భంగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలి

● తాంసిలో ఆరోగ్య పాఠశాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా ● విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

తాంసి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పాఠశాల వల్ల విద్యార్థులకు మంచి ఉపయోగాలు కలుగుతున్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం తాంసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరోగ్య పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదినప్పుడే మంచి ఫలితాలను సాధిస్తారన్నారు. తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చే బాధ్యత విద్యార్థులపైనే ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. పాఠశాల స్థాయి నుంచి ఆరోగ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థిని విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమం వల్ల వ్యాధుల పట్ల పూర్తి అవగాహన విద్యార్థులకు రానుందని అన్నారు. ఇప్పటి నుంచి విద్యార్థినీ విద్యార్థులు యోగాసనాలు, వ్యాయామాలు చేయాలని సూచించారు. శరీరానికి సంబంధించిన వ్యాయామం చేయడం వల్ల విద్య పట్ల మరింత ఆసక్తి కలుగుతుందని ఈ విషయాన్ని గమనించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు అర్థమయ్యేలా ఆరోగ్య పాఠాలను బోధించాలని సూచించారు. విద్యార్థులు హాజరు శాతాన్ని పెంచేలా కూడా చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీ ఉన్నారు.

సర్వేలో తప్పులు లేకుండా చూడాలి

తాంసి : కుటుంబ సమగ్ర సర్వేను తప్పులు లేకుండా చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం తాంసి మండల కేంద్రంలో ఎలా సర్వే చేస్తున్నారో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని ఇండ్లకు స్టిక్కర్లు అతికించారో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం సర్వేను చేపట్టాలన్నారు. సిబ్బంది వారి వారి విధులను బాధ్య తాయుతంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా ఎవరైనా ఇళ్లకు స్టిక్కర్ అతికించలేకపోతే వెంటనే వారి వివరాలు సేకరించి, సరియైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సర్వే చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లను పరిశీలించారు. అదే విధంగా గ్రామంలో ఇప్పటి వరకు చేపట్టిన పనులను తిలకించారు. ఆయనతో పాటు ప్రత్యేక అధికారి వెంకటరమణ, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీ, పలువురు అధికారులు తదితరులు ఉన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా



స్టిక్కర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్ : పోటీపరీక్షలకు సన్నదమవుతున్న విద్యార్థులు అనవసర భయాందోళనలకు గురికాకుండా ఏకాగ్రతతో చదువు కొనసాగించాలని, ఉత్తమ ఫలితాలు సాధించేలా నిరంతరం సాధన చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. గురువారం ఆదిలాబాద్ డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎంసెట్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ కో-ఆర్డినేటర్ రవీందర్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, బీసీ స్టడిసర్కిల్ ప్రవీణ్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

● ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఉట్నూర్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) రైతులు తాము పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దే అమ్మకాలు చేపట్టాలని, దళారులకు అమ్ముకుని నష్టపోవద్దని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. గురువారం ఉట్నూర్ మండలంలోని కొత్తగూడ (చెక్ పోస్టు) దంతనపల్లి గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషిచేస్తుందని అన్నారు. రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. తక్కువ ధరల్లో పంట లను అమ్మకూడదని, ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు ధరకే అమ్మాలని సూచించారు. సన్న వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. రైతాంగం దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను నిత్యం పర్యవేక్షణ చేస్తూ ఉండాలని సూచించారు. రైతుల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ అని వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో ఇచ్చిన ప్రతి మాటను నేరవేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖయ్యుం, మర్సుకోల తిరుపతి, లింగంపల్లి చంద్రయ్య, ఇక్బాల, అధికారులు ఏపీఎం అనిల్‌కుమార్, దం తనపల్లి కార్యదర్శి అరవింద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య పాఠశాల నిర్వహణతో విద్యార్థుల్లో మార్పు

● జిల్లా వైద్యాధికారి నరేందర్



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న జిల్లా వైద్యాధికారి

బోథ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఆదిలాబాద్ జిల్లాలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ప్రారంభించడం జరిగిందని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సోనాల గ్రామంలో ఆరోగ్య పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ తీసుకున్న నిర్ణయం వల్ల ప్రతి విద్యార్థిలో శారీరకంగా మానసికంగా మార్పు వస్తుందన్నారు. కొన్ని రోజుల పాటు విద్యాబోధన ఉపాధ్యాయులు చేసిన తరువాత విద్యార్థులు విద్యార్థులకు విద్యాబోధన చేసే ఆస్కారం ఉందన్నారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి మిల్కా మాట్లాడుతూ సరదాగా ప్రారంభించిన అలవాట్లు జీవితంలో దురలవాట్లుగా మారి జీవితాలను నాశనం చేస్తున్నాయన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లతో శారీరక మానసికస్థితి వృద్ధి చెందుతుందన్నారు. ఉన్నతలక్ష్యంతో చేపట్టిన కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఉపాధ్యా యులు కృషిచేయాలని కోరారు. అయితే కార్య క్రమాన్ని ప్రారంభించాల్సిన కలెక్టర్ అనివార్య కారణాల వల్ల రాలేకపోయారని త్వరలోనే పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడ తారన్నారు. సోనాల పాఠశాలను ఆదర్శపాఠశాల తీసుకొని కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకుగాను మూడుశాఖల విద్య, వైద్య, స్త్రీశిశు సంక్షేమ శాఖల వారు ఉండటం హర్షించదగ్గ విషయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థి రిటైర్డ్ ఉపాధ్యాయులు గాజుల పోతన్న పాఠశాల అభివృద్ధికి పదివేల రూపాయల ఆర్థికసహాయాన్ని అందించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా 10 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు.